సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 11 । ఆగస్టు । 2024

న్యూస్‌రీల్

'స్మార్ట్'గా మొదలుపెట్టేశారు.!

తొలి స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసిన ఈపీడీసీఎల్



స్మార్ట్ మీటర్ అమర్చుతున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: స్మార్ట్ మీటర్లపై గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలు ఆరోపణలు చేస్తూ నానాయాగీ చేసిన టీడీపీ, జనసేన.. ఇప్పుడు అధికారంలోకి రాగానే స్మార్ట్‌మీటర్లకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో తొలి స్మార్ట్ మీటర్‌ను విశాఖపట్నం జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ విభాగంలో అమర్చారు. ఈ మీటర్ల అమర్చే కార్యక్రమాన్ని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పర్యవేక్షించారు.

జీతాల కోసం భిక్షాటన



భిక్షాటన చేస్తున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు వేతనాల కోసం శనివారం వినూత్న నిరసన చేపట్టారు. కొన్ని నెలలుగా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆలస్యంగా జీతాలు చెల్లిస్తున్న నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి వీరు ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఎల్అండ్‌డీ సీ కూడలి నుంచి ఉక్కు అడ్మిన్ కూడలి వరకు రోడ్డు పక్కన బైఠాయించి భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యువ కార్మికులు మాట్లాడుతూ తమకు జీతాలు చెల్లించడంపై యాజమాన్యం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. యాజమాన్యం ఇకనైనా తమ బాధలు అర్థం చేసుకుని సకాలంలో జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు పరంధామయ్య, డీఐటీయూ ప్రధాన కార్యదర్శి బి.డేవిడ్ వీరికి సంఘీభావం తెలిపారు.

పంద్రాగస్టు వేడుకలకు జయ లిఖిత



బీచ్‌రోడ్డు: దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న పంద్రాగస్టు వేడుకలకు నగరానికి చెందిన జయ లిఖితకు ఆహ్వానం లభించింది. ఈ మేరకు కేంద్ర యువజన వ్యవహారాల క్రీడల మంత్రిత్వ శాఖ నుంచి శనివారం ఆమెకు సమాచారం అందింది. దేశ వ్యాప్తంగా 78 మందిని, రాష్ట్ర వ్యాప్తంగా నలుగురు విద్యార్థులను ఈ వేడుకలకు ఎంపిక చేశారు. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి జయ లిఖిత ఎంపికైనట్లు నెహ్రూ యువ కేంద్రం అధికారి మహేశ్వరరావు తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆమె స్వచ్ఛందంగా పాల్గొని సేవలందించారని, ఈ మేరకు వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించిందని వెల్లడించారు.

సెప్టెంబర్ 1 నుంచి ఏఐటీయూసీ సమావేశాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అల్లిపురం: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ తెలిపారు. శనివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఉక్కునగరం గురజాడ కళాక్షేత్రంలో సమావేశాలు జరుగుతాయన్నారు. చివరి రోజు నగరంలో వేలాది మంది కార్మికులతో ప్రదర్శన, అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ జరుపుతామని తెలిపారు. ఈ సమావేశాలకు జాతీయ సమితి సభ్యులు, అగ్రనాయకులతో పాటు ప్రభుత్వ రంగ ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ఉపాధ్యక్షులు ఎస్‌కే రెహమాన్, జేడీ నాయుడు, కోశాధికారి సత్యాంజనేయ పాల్గొన్నారు. ఈ సందర్భం సమావేశాల పోస్టర్ ఆవిష్కరించారు.

10 శాతం

ప్రతి పనికి పర్సంటేజీ

దోచుకుందాం.. పంచుకుందాం..



'హమ్మయ్యా.. ఎలాగోలా గెలిచేశాం.. **భయపెట్టాం.. డబ్బులిచ్చాం..** కుట్ర రాజకీయాలు చేశాం.. అంతా **అనుకున్న ప్రకారమే జరిగింది.** స్టాండింగ్ కమిటీని సొంతం చేసుకున్నాం. **ఇంకేంటి మరి.. అసలు** కార్యక్రమాన్ని షురూ చేయడమే. ఎవరూ **ఎక్కడా తగ్గొద్దు. ఇప్పటికే** బోలెడు ఖర్చు పెట్టేశాం. దానికి డబుల్, **ట్రిబుల్ రావాలి. దానికోసం** ప్లాన్ చేయండి. ఇక్కడ మీరు మాత్రమే **సభ్యులు కాదు. మీరు ఆ సీట్లో** కూర్చోవడానికి మేము కారణమని గు**ర్తుంచుకోండి. మా వాటాలు** మాకు వచ్చేలా చూస్కోండి మరి..'

ఇటీవల జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన టీడీపీ కార్పొరేటర్లతో కూటమి ఎమ్మెల్యేలు చెప్పిన మాటలివీ..



- అప్పుడే పనుల ఆమోదానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి
- జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులకు కూటమి ఎమ్మెల్యేల ఆదేశం
- ఈ విజయం అందరి కష్టం.. అందుకే వాటాలు
- టీడీపీ ముఖ్య కార్పొరేటర్లు, సభ్యులతో రహస్య సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ఈనె 7వ తేదీన స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఫలితాల అనంతరం తర్వాత జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలోని ఓ హోటల్‌లో టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలతో పాటు ముఖ్యమైన కార్పొరేటర్లు, గెలుపొందిన సభ్యులు రహస్యంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓ టీడీపీ ఎమ్మెల్యే సమావేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ స్టాండింగ్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. 'ఇవి చిన్న ఎన్నికలే అయినప్పటికీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. అధికారంలో ఉన్నప్పుడు ఈ ఎన్నికల్లో గెలవకపోతే పార్టీ పరువుపోతుంది. అందుకే స్థాయికి మించి ఖర్చు చేశాం. ప్రభుత్వం మనదే.. ఏది చెప్తే అదే లెక్క.. దాని ప్రకారం సంపాదించుకోవాలంటూ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి ఇలా మాట్లాడటంపై టీడీపీ కార్పొరేటర్లు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

దోచుకోవడమే.. ప్రథమ ప్రాధాన్యం

జీవీఎంసీలో జరగాల్సిన పనులకు సంబంధించిన అంశాల్ని స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదిస్తారు. రూ.50 లక్షలలోపు విలువైన పనులతో పాటు పరిపాలన పరమైన నిర్ణయాలను తీసుకునే అధికారం స్టాండింగ్ కమిటీకి ఉంటుంది. స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందితే గ్రేటర్‌లో జరిగే పనులు చేపట్టేందుకు, బిల్లులు చెల్లించేందుకు ఎలాంటి ఇబ్బందులుండవు. కౌన్సిల్ మూడు నెలలకోసారి జరిగితే, ప్రతి 2 వారాలకొకసారి స్టాండింగ్ కమిటీ సమావేశమవుతుంటుంది. మూడు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ హయాంలో అంతా పారదర్శకంగా నిర్వహించారు. ఈసారి టీడీపీ ప్రజాప్రతినిధులు మాత్రం సభ్యుల నామినేషన్ల సమయంలోనే వసూళ్లకు ప్రాధాన్యమిచ్చారు. ఎవరు డబ్బులిస్తే వారికే నామినేషన్ వేసేందుకు అవకాశం కల్పించారు. ఇప్పుడు ఆ డబ్బులు వసూలు చేసుకోవడంతో పాటు వాటాలందించేందుకు అవసరమైన మొత్తాన్ని అందినకాడికి దోచుకోవాలని భావిస్తున్నారు.

పర్సంటేజీలు పెంచాల్సిందే..

ఎన్నికలు జరగకముందే నిర్వహించిన సమావేశంలో ఒకవేళ గెలిస్తే 10 నుంచి 20 శాతం పర్సంటేజీలు కుదుర్చుకోవాలని ఎమ్మెల్యేలు కార్పొరేటర్లకు సూచించారు. ఎన్నికల జరిగిన తర్వాత కూడా అదే పాట పాడారు. స్టాండింగ్ కమిటీ అజెండాలో ప్రతిపాదించిన ప్రతి పనిలోనూ వాటాలు తీసుకొని.. ఇష్టం వచ్చినట్లుగా సంపాదించుకోండంటూ టీడీపీ కార్పొరేటర్లకు హితోపదేశం చేయడం విడ్డూరం. గెలుపొందిన సభ్యులు సంపాదించుకోవడంతో పాటు ఎమ్మెల్యేలకు కొంత, కార్పొరేషన్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ముగ్గురు టీడీపీ కార్పొరేటర్లకు కూడా కొంత మేర ముట్టజెప్పాలని హుకుం జారీ చేశారు. ఈ విషయం తెలిసి కాంట్రాక్టర్లు కూడా అయోమయంలో పడిపోయారు. పనులకు టెండర్లు వేస్తే బిల్లుల్లో మిగిలింది కూడా టీడీపీ నేతలకే వెళ్లిపోతే తమ పరిస్థితెలా ఉంటుందోనని వాపోతున్నారు. మరోవైపు జీవీఎంసీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అధికారులకు స్టాండింగ్ కమిటీ అజెండాలో పెట్టే ప్రతి చిన్న పనికీ అంచనాలకు మించి లెక్కలు పెంచాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ లెక్కన రానున్న ఏడాది పాటు జీవీఎంసీ ఖజానా మొత్తం టీడీపీ నేతల జేబుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ముంచుకొస్తుందేమోనని అధికారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మాదే..



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్లు

- కూటమి కుట్రలను తిప్పికొడతాం
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప **ఎన్నికలో** విజయం తమదేనని మాజీ మంత్రి, వైఎ**స్సార్‌సీపీ** ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ **ధీమా వ్యక్తం** చేశారు. కూటమి పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడినా తిప్పికొడతామన్నారు. శనివారం ఓ ప్రైవేట్ హోటల్లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈనెల 30వ తేదీ తరువాత వైఎస్సార్ సీపీ వ్యూహం ఏమిటో అందరికీ తెలుస్తోందన్నారు. ఈనెల 12న నామినేషన్ వేస్తానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా విజయంలో భాగస్వాములవ్వాలన్నారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ తొలి విడత ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం పూర్తయిందని, వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన ప్రతీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కౌన్సిలర్, కార్పొరేటర్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలనే కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీకి 80 శాతానికి పైగా బలం ఉందని, ఎవరెన్ని కుయుక్తులు పన్నినా విజయాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, నియోజకవర్గ సమన్వయకర్తలు కె.కె.రాజు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పెరిగిన మరింత బలం

- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక ఓటర్ల నమోదు
- కొత్తగా ముగ్గురు దరఖాస్తు
- 838 మంది సభ్యులతో జాబితా సిద్ధం
- 13న తుది జాబితా ప్రకటన

మహారాణిపేట: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మరింత బలం పెరిగింది. ఆరు వందలకుపైగా ఓటర్లతో ఇప్పటికే స్పష్టమైన ఆధిక్యత ఉండగా మరో ముగ్గురు ఓటు నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఓటర్లు నమోదు కార్యక్రమం శనివారంతో ముగిసింది. కొత్తగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, డాక్టర్ కుంభా రవిబాబు దరఖాస్తు చేశారు. వీటిని విచారణ కోసం జీవీఎంసీకి పంపారు. ఈనెల 13న తుది జాబితాను ప్రకటిస్తారు.

ఓటర్ల వివరాలు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 838 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 39 మంది జెడ్పీటీసీల్లో ప్రస్తుతం 36 మంది జెడ్పీటీసీ ఉన్నారు. అల్లూరి జిల్లాకు చెందిన హుకుంపేట జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం అరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రావికమతం జెడ్పీటీసీ తలారి రమణమ్మ, సబ్బవరం జెడ్పీటీసీ తుంపాల అప్పారావు చనిపోయారు. ప్రస్తుతం ఉన్న జెడ్పీటీసీల్లో వైఎస్సార్‌సీపీకి 34 మంది, టీడీపీకి నర్సీపట్నం జెడ్పీటీసీ, సీపీఎంకి అనంతగిరి జెడ్పీటీసీ ఉన్నారు. మొత్తం 652 మంది ఎంపీటీసీలకు గాను 636 మంది ఎంపీటీసీలు ఉన్నారు. 16 మంది ఎంపీటీసీ పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో వైఎస్సార్ సీపీకి 477 మంది, టీడీపీకి 116 మంది, ఇండిపెండెంట్లు 28 మంది, జనసేనకు ఇద్దరు, బీజేపీకి ఆరుగురు, సీపీఐకి ఇద్దరు, సీపీఎంకి ముగ్గురు, కాంగ్రెస్‌కు ఇద్దరు సభ్యులు ఉన్నారు. జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లకు గాను ఒక స్థానం ఖాళీగా ఉంది. యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో 25 మంది కౌన్సిలర్లు, నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అలాగే ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యులుగా ఉన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలకు బ్రేక్

- నరవలో అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన తహసీల్దార్
- లారీలు తిరుగుతున్న మార్గంలో కందకాలు తవ్వి అడ్డుకట్ట

సాక్షి ఎఫెక్ట్..

పెందుర్తి: పెందుర్తి రెవెన్యూ పరిధి నరవ అటవీ, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలకు రెవెన్యూ అధికారులు చెక్ పెట్టారు. నరవ ప్రాంతంలో మట్టి తరలిస్తున్న టిప్పర్లు తిరిగే మార్గంలో కందకాలు(ట్రెంచ్) తవ్వి తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ఇక్కడి సర్వే నంబర్ 29, 27/8లలో కొంతకాలంగా అనుమతి లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. స్థానిక యంత్రాంగాన్ని మచ్చిక చేసుకుని టీడీపీ–జనసేన నాయకులు ప్రకృతి వనరులను అక్రమంగా దోచుకుంటున్నారు. నిత్యం పొక్లెయిన్లతో తవ్వి.. టిప్పర్లతో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సాక్షిలో 'అడవిలో అక్రమ తవ్వకాలు' శీర్షిక శనివారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేశారు. ఆయా ప్రాంతాల్లో టిప్పర్లు రాకపోకలు సాగించకుండా కందకాలు తవ్వి నిరోధించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



నరవలో అక్రమ తవ్వకాలు జరపకుండా దారిలో కందకాలు తవ్విన రెవెన్యూ అధికారులు

- ఎస్ఆర్ పురం గ్రామ సమీపంలోని కొండవాలులో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న పొక్లెయిన్, రెండు లారీలను తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇక్కడ అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై శనివారం వేకువజామున కాపు కాసి లారీలతో పాటు పొక్లెయిన్‌ను సీజ్ చేశామన్నారు. కేసును మైనింగ్ శాఖకు బదలాయించినట్లు పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్య

వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు



పెదగంట్యాడ జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న పరదేశి, గురుమూర్తి, గోవింద్ తదితరులు



జీవీఎంసీ 55వ వార్డు ధర్మానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

కంచరపాలెం: విజయవాడలోని సామాజిక న్యాయ మహా శిల్పంపై పచ్చ మూకలు దాడి చేసి.. దేశ ప్రజలను అవమానించారని వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. సామాజిక మహా శిల్పంపై దాడికి నిరసనగా కంచరపాలెం ధర్మానగర్ జాతీయ రహదారిలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికే రక్షణ లేకుండా పోయిందన్నారు. దాడి చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, బర్కత్ అలీ, మాజీ కార్పొరేటర్లు బులుసు జగదీష్, వార్డు అధ్యక్షుడు పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాసరావు, మాజీ డైరెక్టర్లు పైడి శ్రీను, నూకరాజు, కె.సుశీల, దిడ్డి రమేష్, నాయకులు సోండి సురేష్, చిరంజీవి, కె చిన్నా, సుకుమార్, రత్నం, రాజు, కృపా, స్వామి, కరుణ, లక్ష్మి, ధర్మవతి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం

పెదగంట్యాడ: విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని, శిలా ఫలకాన్ని ధ్వంసం చేయడం రాజద్రోహమే అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మార్టుపూడి పరదేశి అన్నారు. దాడికి నిరసనగా పెదగంట్యాడ జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక దళిత నాయకులతో కలసి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికే గర్వకారణమైన సామాజిక న్యాయ శిల్పంపై దాడి చేయడం దారుణమని, దోషులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గంట్యాడ గురుమూర్తి, కటికల కల్పన, మంత్రి శంకరనారాయణ, గంట్యాడ గోవింద్, పెంటారావు, కాకినాడ పెంటారావు, సంపంగి ఈశ్వరరావు, పిట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు.. యువత చిత్తు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ బాగ్చి, పలు శాఖల అధికారులు

బీచ్‌రోడ్డు: డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాల వినియోగానికి, చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్.కె.బీచ్ రోడ్డులో అవగాహన ర్యాలీ జరిగింది. కాళీమాత ఆలయం వద్ద నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలిసి కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి మహమ్మారి చాలా సమస్యలకు మూలకారణంగా నిలుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాల బారి నుంచి బయటపడేందుకు డీ అడిక్షన్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సీపీ బాగ్చి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా అనేది జాతీయ సమస్య అని.. దీన్ని అరికట్టేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఫ్యాషన్‌గా భావించి యువత మత్తులోకి దిగవద్దని.. తర్వాత బాధపడొద్దని హితవు పలికారు. ర్యాలీలో సాంఘిక సంక్షేమ డి.డి.రామారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, విద్య, న్యాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

1 నుంచి హెల్మెట్ తప్పనిసరి

గోపాలపట్నం: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్లు వినియోగించాలని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో సూచించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ద్విచక్ర వాహనచోదకుడితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తికి కూడా హెల్మెట్ తప్పనిసరి చేస్తున్నట్లు నిర్ణయించారు. ఈ నిబంధన సెప్టెంబర్ ఒకటి నుంచి అమల్లోకి రానుందని డీటీసీ తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే వాహనచోదకుడికి జరిమానాతో పాటు మూడు నెలల పాటు లైసెన్స్ సస్పెండ్ చేస్తామన్నారు. అలాగే బీఐఎస్ మార్క్ ఉన్న హెల్మెట్లనే వినియోగించాలని సూచించారు. నాసిరకం హెల్మెట్లు విక్రయించిన వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నవంబరు వరకు విశాఖ-బెంగళూరు స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–ఎస్ఎంవీ బెంగళూరు స్పెషల్‌ను నవంబరు వరకు పొడిగించినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖ–ఎస్ఎంవీ బెంగళూరు(08543) వీక్లీ స్పెషల్‌ను నవంబరు 24 వరకు, ఎస్ఎంవీ బెంగళూరు–విశాఖ (08544) స్పెషల్‌ను నవంబరు 25 వరకు పొడిగించామని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాన్నా..

చిన్నారి ఆద్య ఆఖరి మాట

స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి మృతి

తండ్రి కళ్లెదుటే ఘటన



ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు

తగరపువలస: మూడేళ్ల చిన్నారికి అప్పుడే నూరేళ్లు నిండిపోయాయి. తాను చదువుతున్న స్కూల్ బస్సు కిందే ప్రమాదవశాత్తూ పడి చనిపోయింది. భీమిలి మండలం మజ్జిపేటలో శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. భీమిలి పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలివీ.. చిన్నారి ఆద్య పద్మనాభం మండలం రెడ్డిపల్లి కూడలిలోని జ్ఞానజ్యోతి స్కూల్‌లో నర్సరీ చదువుతోంది. సాయంత్రం స్కూల్ నుంచి బస్సులో వచ్చిన చిన్నారి మజ్జిపేటలో దిగింది. అవతలి రోడ్డులో ఆమె తండ్రి సురేష్‌ను చూడగానే నాన్నా అంటూ రోడ్డు దాటే ప్రయత్నం చేసింది. ఇది గమనించని బస్సు డ్రైవర్ సూరిబాబు ముందుకు పోనివ్వగా బస్సు తగిలి కింద పడిపోయింది. ఈ ఘటనలో రోడ్డుకు బలంగా తగిలి చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె తండ్రి సురేష్ పద్మనాభం మండలం రెడ్డిపల్లి పంచాయతీ భద్రయ్యపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. తల్లి లత గృహిణి. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఆద్య వీరి చిన్న కుమార్తె. భీమిలి సీఐ డి.రమేష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆద్య మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అయోధ్య రాముడి వెండి ధనస్సుకి పూజలు



ధనస్సుకు పూజలు చేస్తున్న భక్తులు

టీచర్‌రోడ్డు: అయోధ్యలోని శ్రీరామచంద్రమూర్తికి అలంకరించే 7 అడుగుల వెండి ధనుస్సును శనివారం ఏయూ అవుట్ గేట్ వద్ద గల శ్రీ కోదండ రామాలయంలో ప్రదర్శించారు. భక్తుల సందర్శనార్థం చల్లా శ్రీనివాస్ శాస్త్రి ఈ ధనస్సును రామాలయానికి తీసుకువచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని.. ధనస్సుకు పూజలు నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం

మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి



ఐక్యత చాటుతున్న ఎస్సీ సంఘాల నాయకులు

దాబాగార్డెన్స్: ఎస్సీ వర్గీకరణను తాము పూర్తిగా ఖండిస్తున్నామని మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి తెలిపారు. వర్గీకరణ పేరిట తమ మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని, లేదంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఎస్సీ సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లీశ్వరీ మాట్లాడుతూ రాష్ట్రంలో 7.90 లక్షల మంది పైచిలుకు మాలలున్నారని, వారి మనోభావాలు దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన, దాడులు చేసినా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. రాజ్యాంగ వ్యతిరేకమైన సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉపసంహరించుకునేంత వరకు పోరాడుదామని, మన హక్కులు సాధించుకుందామని ఈ సందర్భంగా మల్లీశ్వరీ పిలుపునిచ్చారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.రఘునాథ్, రిటైర్డ్ తహసీల్దార్ డి. రామప్పడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు బి.బుద్ధుడు, రిటైర్డ్ ఏపీవో జి.తవిటయ్య, దళిత నాయకులు టి.మోహన్‌రావు, జి. రమణ, ఎస్.గురువులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	: రూ.78
బ్రాయిలర్ (లైవ్)	: రూ.98
స్కిన్	: రూ.166
స్కిన్‌లెస్	: రూ.176



నందు(పేరు మార్చాం) విశాఖలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి. మంచి జీతం. విలాసవంతమైన జీవితం. ఆఫీసులోనే తన కొలీగ్ రమ్య(పేరు మార్చాం)ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఏడాదిన్నర కాలం చాలా అన్యోన్యంగా ఉన్నారు. అక్కడ నుంచి ఇద్దరి మధ్య ఇగో సమస్య తలెత్తింది. ఆఫీసులో మహిళలతో మాట్లాడితే రమ్యకు నచ్చేది కాదు. మాట్లాడితే తప్పేంటి.. అని నందు... మాట్లాడవద్దని రమ్య.. తరచూ గొడవ పడేవారు. రోజురోజుకూ రమ్యలో అనుమానం పెరిగింది. దీంతో కలిసుండలేనని నిర్ణయించుకుంది. పరస్పర అంగీకారం మేరకు జిల్లా కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకుని విడిపోయారు.

మేఘన, సందీప్(పేర్లు మార్చాం).. ఇద్దరూ మంచి స్నేహితులు. మేఘన షార్ట్ ఫిల్మ్స్, రీల్స్ చేస్తూ పాపులారిటీ సంపాదించింది. సందీప్ ఓ ప్రైవేట్ ఉద్యోగి. వీరి స్నేహం కాస్త ప్రేమగా మారింది. పెద్దలను ఎదురించి స్నేహితుల సాయంతో పెళ్లి చేసుకున్నారు. కనీసం ఏడాది కూడా గడవలేదు. ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. ఓ రొమాంటిక్ షార్ట్ ఫిల్మ్‌లో మేఘన నటించింది. ఇది సందీప్‌కు నచ్చలేదు. అనుమానం రోజురోజుకు ఎక్కువైంది. పెళ్లికి ముందు కూడా షార్ట్ ఫిల్మ్‌లు నటించా.. అప్పుడు భలే చేశావ్..అంటూ ప్రోత్సహించి.. ఇప్పుడేమో అనుమానం పడితే ఎలా అని నిలదీసింది. అనుమానం ఉన్న చోట ఇమడలేనని మేఘన విడాకులు తీసుకుంది.

ఈ సంఘటనలు నేటి సమాజంలో పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. వివాహ జీవితం అందమైన సుదీర్ఘ ప్రయాణం.. ఈ ప్రయాణంలో ఎన్నో అవరోధాలు ఎదురవుతాయి. అవన్నీ దాటుకుని.. ప్రేమ, సహనం, విశ్వాసంతో ముందుకు సాగితే మూడుముళ్ల బంధం నిండు నూరేళ్లు ఉంటుంది. అందుకే 'తెంచుకుంటే తెగిపోతుందా దేవుడు వేసిన బంధం.. తెలుసుకో నీ జీవిత గమ్యం పెంచుకొమ్మ అనుబంధం' అన్నాడో సినీ కవి. కానీ దురదృష్టవశాత్తు కొందరి జీవితాల్లో మూడుముళ్ల బంధం అర్థాంతరంగానే ముగిసిపోతోంది.

-అల్లిపురం

SUNDAY SPECIAL

బంధం బరువవుతోంది

- తెగిపోతున్న పవిత్ర బంధం
- అనుమానం, ఇగో సమస్యలే కారణం
- రోజురోజుకూ పెరుగుతున్న విడాకుల కేసులు
- ఏడాదికి సుమారు 3 వేల కేసుల నమోదు

పెళ్లంటే నూరేళ్ల పంట. ఎన్నాళ్ల నుంచో ఉన్న అభిప్రాయం ఇది. కానీ ఇప్పుడా పరిస్థితి మారిపోతోంది. ఎన్నో జంటలు పెళ్లయిన ఏడాది, రెండేళ్లకే కలిసి బతికేందుకు ససేమిరా అంటున్నాయి. ఒకప్పుడు సెలబ్రిటీలు, సంపన్న వర్గాల్లోనే కొంత వరకు కనిపించిన ఈ ట్రెండ్... ఇప్పుడు అన్ని వర్గాల్లోనూ సాధారణమైపోయింది. ఒక్కరు ఇద్దరు కాదు.. వందల జంటలు ఈ బాట పడుతున్నాయి. ఉద్యోగాల పేరిట దూర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించడం వల్ల ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయి. ఆధునిక జీవనశైలి, పని ఒత్తిడి వల్ల కుటుంబానికి తగినంత సమయం కేటాయించడం కష్టంగా మారింది. ఇతరుల జీవితాన్ని చూసి తమ జీవితం సంతోషంగా లేదని భావించడం, అధిక అంచనాలు పెట్టుకోవడం వల్ల వివాహ జీవితంపై ఒత్తిడి పెరుగుతోంది. వీటితో పాటు భార్యాభర్తల మధ్య అహం, అపార్థం, అనుమానాలు.. ఇలా ఎన్నో కారణాలతో విభేదాలు వస్తున్నాయి. ఏ సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించుకోవడానికి ప్రయత్నించుకునే ఓపిక లేకుండా పోయింది. ఈ క్రమంలో విడాకులే మార్గమని భావించి మూడు ముళ్ల బంధానికి మధ్యలోనే స్వస్తి చెబుతున్నారు. ఈ కోవలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఉండటం విచారకరం. విశాఖ ప్రధాన ఫ్యామిలీ కోర్టులో ఏడాదికి సుమారు 3 వేలపై చిలుకు కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది శుక్రవారం నాటికి 1,600 పైగా విడాకుల కేసులే నమోదయ్యాయి. పరస్పర అంగీకారంతో భార్యాభర్తలు విడిపోతుండటంతో.. కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతోంది.

ప్రేమ పెళ్లిళ్లదీ అదే పరిస్థితి

నాలుగు గోడల మధ్య సర్దుకుపోవాల్సిన బంధాలు చాలా వరకు రోడ్డున పడుతున్నాయి. చిన్న సమస్య కూడా చివరికి పెద్ద గాలివానలా మారుతోంది. భార్యాభర్తల మధ్య అగాధం పెరిగి చివరికి విడిపోయేందుకు సిద్ధమై పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లే కాదు.. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారి పరిస్థితి కూడా మూన్నాళ్ల ముచ్చటగా తయారవుతోంది. క్షణికావేశంలో పంతాలకు పోయి బంధాలను తెంచుకుంటున్న దంపతుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. దంపతుల మధ్య విభేదాలు వారి పిల్లలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.



చట్ట సవరణతో..

హిందూ వివాహాన్ని విడాకుల ద్వారా రద్దు చేసుకోవాలంటే.. 1976కు ముందు చాలా కారణాలు చూపించాల్సి ఉండేది. అప్పుడు భార్యాభర్తలు ఇష్టపడి విడాకులు తీసుకోవాలన్నా.. ఇచ్చేవారు కాదు. 1976లో ఓ సవరణ ద్వారా హిందూ వివాహ చట్టం సెక్షన్ 13బీని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం భార్యాభర్తలిద్దరూ ఓ కారణం చూపి.. తాము ఒక ఏడాది ముందు నుంచి కలసి ఉండటం లేదని, ఇక ముందు కలసి ఉండలేమని విడాకులకు న్యాయస్థానంలో ఉమ్మడిగా దరఖాస్తు దాఖలు చేసుకోవచ్చు. అప్పటి నుంచి విడాకుల కేసులు నమోదవుతూ వస్తున్నాయి. ప్రస్తుతం ఆ సంఖ్యలో బాగా పెరిగిపోయింది.

28-35 ఏళ్లలోపు వారే..

విడాకుల కేసుల సంఖ్య పెరగడానికి ఇగో, గొడవలు, కుటుంబ వివాదాలు ప్రధాన కారణాలని నిపుణులు పేర్కొంటున్నారు. విడాకులు కోరుతున్న జంటల్లో ఎక్కువ మంది 28–35 ఏళ్ల మధ్య వయస్కులే. చాలా మంది జంటలు పరస్పర అంగీకారంతో విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయిస్తున్నాయి. మరోవైపు భరణం కోసం పిటిషన్ల సంఖ్య కూడా పెరుగుతోంది.

అప్పుడే.. విడాకులు మంజూరు

వివాహ బంధాన్ని నిలబెట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపించడమే గాక వైరుధ్య భావాలు ఉన్న దంపతులతో కాపురం చేయించేందుకు కోర్టులు ప్రయత్నిస్తాయి. అయినప్పటికీ కొన్ని వివాహాలు విఫలమవుతుంటాయి. కాగా.. విడాకులకు చట్టం కొన్ని కారణాలను పేర్కొంది. ఆ కారణాలు రుజువైన సందర్భాల్లో మాత్రమే విడాకులు మంజూరు చేస్తుంది.

ఫలితమివ్వని కౌన్సెలింగ్‌లు

విభేదాలు వచ్చిన దంపతులను కలపడానికి ఎన్ని కౌన్సెలింగ్‌లు ఇచ్చినా ఫలితం లేకుండా పోతోంది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్న కుటుంబాలు ఏర్పడడం వల్ల సంప్రదాయాలు, సత్సంబంధాల గురించి తెలియడం లేదు. ఒకరి నిర్ణయాలను ఒకరు గౌరవించుకోకపోవడంతో పాటు కొందరు మొండిగా వ్యవహరిస్తున్న కారణంగా భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు. నేను చెప్పిందే వినాలనే ధోరణిలో అధికంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. వారికి సర్ది చెప్పేందుకు పెద్దలు లేకపోవడం, ఒక వేళ ఉన్నా వారి దృష్టికి సమస్యలు తీసుకు వెళ్లేందుకు భార్యాభర్తలు ఇష్టపడని కారణంగా రోజురోజుకు విడాకులు పెరుగుతూ వస్తున్నాయి.



సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు



అమ్మాయిలు నేడు ఆర్థికంగా, స్వతంత్రంగా జీవిస్తున్నారు. దీంతో వారు సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. కుటుంబ వ్యవస్థ పట్ల వారి దృక్పథం కూడా మారుతోంది. పురుషుల్లో చాలా మంది ఇప్పటికీ పాత సంప్రదాయాలను అనుసరిస్తున్నారు. వారు పాత తరహా కుటుంబమే కోరుకుంటున్నారు.

– పులగం సుబ్బారెడ్డి, న్యాయవాది

పాశ్చాత్య ధోరణి పెరిగిపోతోంది



నేటి తరం యువతీ యువకుల్లో పాశ్చాత్య ధోరణి పెరిగిపోతోంది. వివాహ బంధంపై అవగాహన లేక విడిపోతున్నారు. చిన్నమాట పడేందుకు ఇష్టపడటం లేదు. మగవారు కూడా అదే పట్టుదలతో ఉండటం వల్ల కోర్టుల్లో ఫ్యామిలీ కేసులు పెరిగిపోతున్నాయి. పోలీస్ స్టేషన్లలో 498ఎ కేసులతో పాటు ఫ్యామిలీ కోర్టుల్లో ఏడాదికి సుమారు 3వేల వరకు కేసులు నమోదవుతున్నాయి. సాధారణ కోర్టుల్లో కన్నా ఫ్యామిలీ కోర్టుల్లో కేసులు అధికంగా నమోదవుతున్నాయి.

– నీలి అమరావతి, న్యాయవాది

పలు రైళ్ల రీ షెడ్యూల్, గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పలాస–పూండి–నౌపడ–విజయనగరం సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో రీ షెడ్యూల్ చేస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ఈనెల 15న భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 12.10 గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12830) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా 1.10 గంటలకు బయల్దేరుతుంది.
- ఈనెల 17న పూరీలో మధ్యాహ్నం 11.15 గంటలకు బయల్దేరాల్సిన పూరీ–గాంధీదాం(22974) ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా మధ్యాహ్నం 12.45 గంటలకు బయల్దేరుతుంది.
- ఈనెల 17న మధ్యాహ్నం 12.10 గంటలకు భువనేశ్వర్‌లో బయల్దేరాల్సిన భువనేశ్వర్– తిరుపతి (22879) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.10 గంటలకు బయల్దేరుతుంది.

గమ్యం కుదించిన రైళ్లు

- ఈనెల 15,17వ తేదీల్లో విశాఖ–పలాస–విశాఖ (07470/07471) మెము స్పెషల్ శ్రీకాకుళం వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుంది. ఈ తేదీల్లో ఈ రైళ్లు శ్రీకాకుళం రోడ్–పలాస మధ్య రాకపోకలు సాగించవు.
- ఈనెల 11వ తేదీన విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం–బ్రహ్మపూర్(08532) స్పెషల్ శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 12వ తేదీన బ్రహ్మపూర్‌లో బయల్దేరాల్సిన బ్రహ్మపూర్–విశాఖపట్నం (08531) స్పెషల్ శ్రీకాకుళం రోడ్ నుంచి బయల్దేరుతుంది.

భార్యపై అనుమానంతో భర్త ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న హరిప్రకాష్ బాబు

సీతమ్మధార: భార్యపై అనుమానంతో ఓ భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ద్వారకా స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. సీతంపేట దరి మధురానగర్‌లోని హరిప్రకాష్ బాబు (43), భువనేశ్వరి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఓ కుమార్తె ఉంది. హరిప్రకాష్ రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఆపరేషన్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అతను మొదటి భార్యతో విడాకులు తీసుకుని.. భువనేశ్వరిని రెండో వివాహం చేసుకున్నారు. కాగా.. అతని భార్య వేరొక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శనివారం తెల్లవారుజామున హరిప్రకాష్ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసుల విచారణలో తేలింది. మృతుడి సోదరి శివకుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ధర్మేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తాం'



బాధితులు నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మధురవాడ: చోరీకి పాల్పడిన నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చెప్పారు. శనివారం ఆయన చోరీ జరిగిన ఎండాడ లా కళాశాల రోడ్డులోని పనోరమ హిల్స్‌ను పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకొన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పనోరమ హిల్స్ నివాసితులకు సూచించారు. పరిసర ప్రాంతాలలో దట్టమైన పొదలు పూర్తిగా తొలగించి, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట పలువురు పోలీసు అధికారులు ఉన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్‌లో సంపత్, సామదేవ్‌కు రజతాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

విశాఖ స్పోర్ట్స్: జాతీయస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో జి.సంపత్‌కుమార్, ఎం.టి. సామదేవ్ రజత పతకాలు సాధించారు. ఈ పోటీలు భువనేశ్వర్‌లో జరగ్గా ఏపీ తరఫున వీరిద్దరూ పాల్గొని పతకాలు సాధించారని ఏపీ అక్వాటిక్ సంఘం కార్యదర్శి మోహన్‌రామ్ తెలిపారు. ఫ్రీస్టయిల్‌లో 200 మీటర్లను 1.55 నిమిషాల్లో పూర్తి చేసి సంపత్ రజతాన్ని సాధించగా, బాక్‌స్ట్రోక్‌లో 200 మీటర్లను 2.07 నిమిషాల్లో పూర్తి చేసి సామదేవ్ రజతాన్ని అందుకున్నాడు. జట్టుకు కోచ్‌గా గణేష్ వ్యవహరించాడు.